
బొజ్జ గణపయ్యా.. నమోస్తుతే!


పెద్దారవీడులో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

- వాడవాడలా కొలువుదీరిన గణనాథుల ప్రతిమలు
- ఉత్సాహంగా వినాయక చవితి


వై.పాలెంలోని కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం


పుల్లలచెరువు: గాంధీ కళాక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దదోర్నాల: వినాయక చవితి పండుగను దర్శి, వై. పాలెం నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే వివిధ మండల పరిధిలోని దేవాలయాల్లో ఆదిదేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో చిన్న వినాయకుని ప్రతిమను తెచ్చుకుని 21 రకాల ఆకులతో పూజించారు. వెచ్చావెంకట సుబ్బయ్య వీధి, ఇందిరా నగర్, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, మెట్టబజార్, కుమ్మరి కాలనీ, వడ్డె బజార్, సీతారామనగర్, వినాయకనగర్‌తో పాటు మండల పరిధిలోని తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. మొట్లమల్లికార్జునపురానికి చెందిన అల్లు ఆంజనేయరెడ్డి మండలంలోని పలు మండపాలకు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

పెద్దారవీడు: మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక స్వామికి ప్రజలు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఇండ్లలో వినాయకుని స్వామి వద్ద పత్రిక, కాయలు, పుస్తకాలు, నైవేద్యం సమర్పించారు. ఆదివారం ఉదయాన్నే చిన్నారులు వినాయకస్వామిని గ్రామం సమీపంలో ఉన్న చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో దేవాలయాల్లో వినాయకుని విగ్రాహాలు ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దారవీడు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు అర్చకులు మేడవరం రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికిని దర్శించుకొని కాయకర్పూం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా శనివారం మండలంలోని ప్రతి గ్రామంలో విఘ్నేశ్వరుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మట్టితో తయారు చేసిన వినాయకుడికి నాయకులు పూజలు చేశారు. కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం ఆకట్టుకుంది. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ఎస్‌బీఐ, కొలుకుల రోడ్డు, బీసీ కాలనీ, వీకే నగర్, పుల్లలచెరువు రోడ్డు తదితర ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు.


వై.పాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్న నాయకులు


పుల్లలచెరువు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథులు వాడవాడల కొలువు తీరారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీ కళాక్షేత్రం, కమ్మవారిపల్లి, గంగవరం ఎస్సీ కాలనీ, ముతరాసుకాలనీ, బ్రహ్మం గారి వీధిలో యాదవ బజార్, లంబాడ తండాలో తదితర వివిధ గ్రామాల్లో వివిధ ఆకారాలతో గణనాథులు కొలువు తీరారు. శనివారం ఉదయాన్నే ఊరేగింపులతో వినాయకుడి విగ్రహాలను మండపాలకు చేర్చి అందంగా అలంకరించారు.

త్రిపురాంతకం: వినాయక చవితి సందర్భంగా శ్రీకార్యసిద్ధి గణపతి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో చామరకర్ణ గణపతికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రతిగ్రామ కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతులు భక్తులచే పూజలందుకుంటున్నారు.


త్రిపురాంతకం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


త్రిపురాంతకం కార్యసిద్ధి గణపతి మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు


పెద్దదోర్నాల: ఐనముక్కలలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం


గాంధీనగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం


ముండ్లమూరు: శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహం

దొనకొండ: మండలంలోని పల్లెల్లో శనివారం భక్తులు ఘనంగా వినాయక చవితి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చెరువులలోని మట్టిని సేకరించి వినాయకుని బొమ్మ చేసి మండపాల్లో అలంకరించారు. పెద్దలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వినాయక విగ్రహాలను తీసుకుని వచ్చి మండపాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజారులు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు చేశారు. పూజారి వినాయకునికి నైవేద్యం సమర్పించి చిన్నారులకు పంచి పెట్టారు.

దర్శి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయమని డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రోటరీక్లబ్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాలను డీఎస్పీ, ఎస్సై మురళి చేతులమీదుగా శనివారం అందజేశారు. దర్శి నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దర్శి మండలంలోని గ్రామాల్లో, పట్టణంలోని వీధుల్లో భక్తులు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. లైటింగ్‌లు వేసి అందంగా తీర్చి దిద్దారు. పత్రి, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తులతో గడియారం స్తంభం సెంటర్ కిటకిట లాడింది.

తాళ్లూరు మండలంలో..

తాళ్లూరు (దర్శి): మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొద్దికూరపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద 55 కిలోల భారీ లడ్డూను వినాయకునికి ప్రసాదంగా పెట్టారు. హైదరాబాదు వంటి ప్రాంతాల్లో పెట్టే ఇంత పెద్ద లడ్డు పెడుతుండటం గమనార్హం.

ముండ్లమూరు (దర్శి): వపసుపుగల్లు, పెద ఉల్లగల్లు, ముండ్లమూరు, వేములబండ, వేముల, ఈదర, భీమవరం, పులిపాడు, శింగనపాలెం, మారెళ్ల, పోలవరం, ఉమామహేశ్వరపురం, తమ్మలూరు, నాయుడుపాలెంలో యువతీయువకులు విగ్రహాల ఏర్పాటు చేశారు. 49 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వై. నాగరాజు ఆదివారం మండలంలోని శింగనపాలెంలో పర్యటించి విగ్రహ కమిటీ సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

కురిచేడు: మండలంలో వినాయక చవితి వేడుకలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూలమాలలతో అలంకరించారు. భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.


వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎస్సై


శింగనపాలెంలో విగ్రహ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఎస్ఐ నాగరాజు


దొనకొండలోని వినాయక విగ్రహం


ఇండ్లచెరువులో వినాయకునికి పూజ చేస్తున్న పూజారి


బొద్దికూర పాడులో 55కిలోల లడ్డూను మేళతాళాలతో తీసుకువస్తున్న దృశ్యం


సందడిగా ఉన్న గడియార స్తంభం సెంటర్


తాళ్లూరు మండలం రజానగరంలో వినాయక చవితి వేడుకలు

క్లుప్తంగా

వరద బాధితులను ఆదుకుందాం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: విజయవాడ వరద బాధితులు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అంతా కలిసికట్టుగా బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ట్విట్టర్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కృష్ణా నది వరద బాధితుల సహాయార్థం శాసన సభ్యుడిగా తన ఒక నెల వేతనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు చీరలు, దుప్పట్ల పంపిణీ


బాధితులకు దుప్పట్లు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

పొదిలి: పొదిలి తాలూకా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఓల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ వాంబే కాలనీ, సింగ్‌నగర్‌లో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు శాలువాలు అందచేశారు. అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాయల్, కార్యవర్గ సభ్యులు గుంటూరు శ్రీనివాసులు, పి.మల్లికార్జునరావు, ఈదుమూడి కృష్ణ, సీహెచ్ శ్రీను, వై.బాలప్రసాదు, బి.వెంకటేశ్వర్లు, రావూరి శ్రీధర్, వి.శ్రీను పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

మార్కాపురం: పట్టణ శివారులోని ఎస్టేట్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్టేట్‌లో నివాసం ఉండే మొఘల్ రిజ్వాన్ ఆలీబేగ్ తన తన నివాసం సమీపంలో చికెన్‌షాపు ముందు నిలబడి ఉండగా గొట్టిపడియ గ్రామానికి చెందిన నవయ్య తన మిత్రులతో కలిసి బైక్‌పై వెళ్తూ పక్కనే ఆగి ఉన్న ఆలీబేగ్‌ను ఢీకొట్టడంతో ఆలీబేగ్‌కు, నవయ్యకు కూడ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించినట్లు ఎస్సై వివరించారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే


గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధి దేశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఉత్సాహంతో వినాయక చవితి సందర్భంగా మార్కాపురంలో వినాయక విగ్రహం కొనుగోలు చేసి స్వగ్రామానికి ట్రాక్టర్‌పై తరలిస్తున్నారు. దేవరాజుగట్టు సమీపంలో ట్రాక్టర్ వెనుకవైపు నుంచి లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. దీంతో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద రెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గాయపడిన వారిని ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని శివప్రసాదరెడ్డి వైద్యులకు సూచించారు. తాము అన్ని వేళల్లో మీకు అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ బండారు రాజు, వైస్ సర్పంచ్ డి. చెంచిరెడ్డి, గుమ్మా వెంకటేశ్వర్లు, డిల్లీ కోటిరెడ్డి, నాగిరెడ్డి కోటిరెడ్డి, చిన్నారి ఉన్నారు.

వర్గీకరణ ఫలితాలు అందరికీ చేరాలి


ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

పొదిలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ద్వారా సుదీర్ఘంగా పోరాటాల ద్వారా సాధించుకున్న వర్గీకరణ ఫలితాలు మాదిగ జాతికి అందరికీ చేరాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ కోరారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిక్షాలు మాట్లాడుతూ వర్గీకరణకు దారి తీసిన పోరాటాలు, అందరికీ చేరాలంటే చేయాల్సిన పనుల గురించి గ్రామాల్లో అందరికీ తెలిసేలా మాదిగ ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. అందరూ ఐక్యంగా కష్టపడటం, పోరాటాలు చేయడం ద్వారానే వర్గీకరణ సాధ్యమైందని మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు మాదిగ అన్నారు. మాదిగలకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఎంఈఎఫ్ కోశాధికారి జాలయ్య, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ దుడ్డు జయ, తాళ్లూరి శేషయ్య, పొదిలి ఎంఈఎఫ్ యూనిట్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని నాగులవరం రోడ్డులోని మీనామసీదు ఎదురుగా ఉన్న డాక్టర్ తాజ్ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ తాజ్‌ఉద్దిన్ ఉల్‌హాక్ తెలిపారు. మోకాల నొప్పులు, కీళ్లు, నడుము నొప్పులు, మెడ నొప్పికి, సోరియాసిస్, వెన్నుముక సమస్యలకు చికిత్స అందించినట్లు తెలిపారు.


శిబిరంలో పరీక్షిస్తున్న డాక్టర్ తాజ్‌ఉద్దీన్

గుంటి గంగాభవానికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గుంటిగంగా భవాని అమ్మవారు

తాళ్లూరు (దర్శి): ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజాకార్యమాలు నిర్వహించారు. గ్రామాల్లో భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదన చేశారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వివేకానంద కళాశాలకు చెందిన 1983–88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు గెట్ టు గెదర్ సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పామూరు శ్రీనివాసరెడ్డి, గురువులు పి.నారాయణరెడ్డి కుమారుడు పిడతల సురేష్‌రెడ్డి, టి.వెంకటరెడ్డిల సహకారంతో పి.ఆర్.కాలనీ సమీపంలోని సంజీవని అనాథ ఆశ్రమానికి, కొంగలవీడురోడ్డులోని అమ్మ ఆశ్రమం, రాచర్ల రోడ్డులోని మానసిక వికలాంగుల పాఠశాలలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆశ్రమం పరిసరాల్లో మొక్కలు నాటారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గర్భిణులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తులసిబాబు, కె.పి.కాశయ్య, అలసందలపల్లె శ్రీనివాసులు, సీహెచ్.ప్రభాకర్, పోలయ్య, పిచ్చిరెడ్డి, గురవయ్య, జయరాంపురానికి చెందిన కాశయ్య, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

58 బస్తాల బియ్యం పట్టివేత


పోలీసు స్టేషన్ వద్ద పట్టుబడిన వాహనం

కురిచేడు: టాటా మేజిక్ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 58 బస్తాల రేషన్ బియ్యాన్ని కురిచేడు పోలీసులు శనివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో పట్టుకున్నారు. ఎస్సై శివ తెలిపిన వివరాల మేరకు.. మర్రిపూడి గ్రామం నుంచి పల్నాడు జిల్లా నాగిరెడ్డి పల్లెకు ఈ రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎన్ఎస్‌పీ కాలువ వద్ద కాపు కాసి బియ్యం, డ్రైవర్, వాహనం స్వాధీనం చేసుకున్నారు. ప్రతి నెలా అక్రమమార్గంలో కురిచేడు నుంచి దర్శి పట్టణంలోని అధికార పార్టీకి చెందిన ఓ మిల్లుకు తరలి వెళుతున్న బియ్యాన్ని పట్టించుకోకుండా ఇతర జిల్లాలకు వెళ్తున్న వాటిని మాత్రమే పట్టుకుంటున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

అక్షర జ్ఞానంతో సంపూర్ణ వెలుగులు

పొదిలి: అక్షర జ్ఞానంతో సమాజంలో సంపూర్ణ వెలుగులు ప్రసరితమవుతాయని వయోజన విద్య పూర్వ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు తాటిపర్తి గోపాలరెడ్డి అన్నారు.

58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఆదివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించారు. తొలుత వయోజన విద్య సిబ్బంది, పర్యవేక్షకులు, బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అందరికీ విద్య అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం గోపాలరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగిపోవాలంటే అందరూ అక్షరాస్యులు కావాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా ఉపసంచాలకుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఏపీఓ సురేఖ, పర్యవేక్షకులు పాల్గొన్నారు.